18122023-MAI-08_Layout 1 12/18/2023 1:33 AM Page 1



# రాబడి

*రాజేశ్.. మ్యూచువల్ ఫండ్స్‌కు కొత్త. తన కుమారుడి ఉన్నత విద్య కోసం రాబోయే 12 ఏండ్లపాటు నెలకు రూ.5వేల చొప్పున పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు. అయితే ఏ మ్యూచువల్ ఫండ్ స్కీంను ఎంచుకోవాలో తెలియక సతమతమవుతున్నాడు. ఈ అయోమయం ఒక్క రాజేశ్‌కే కాదు.. విద్య, సొంతిల్లు, రిటైర్మెంట్ ఫండ్ తదితర లక్ష్యాల సాధన కోసం పెట్టుబడి మార్గాలను అన్వేషిస్తున్న ఇంకా ఎందరిదో. మరి మార్కెట్, ఆర్థిక నిపుణులు ఏం చెప్తున్నారో చూద్దాం.*

## పిల్లల విద్య కోసం ఏ ఫండ్ బెటర్?

**ఇది గుర్తుంచుకోండి**

**ముందుగా** మీ పిల్లలను ఏం చదివించాలనుకుంటున్నారో.. దానికి ప్రస్తుతం అవుతున్న ఖర్చెంతో తెలుసుకోవాలి. ఆ మొత్తానికి 6 నుంచి 8 శాతం చొప్పున వార్షిక ద్రవ్యోల్బణం కలపాలి. పన్నులు ఇతరత్రా వ్యయాలనూ లెక్కించి ముందుకెళ్తే మరీ మంచిది. ఉదాహరణకు మీరు కోరుకుంటున్న కోర్సుకు ఇప్పుడు రూ.10 లక్షలు అవుతుందని అనుకుందాం. దీనికి 6 శాతం వార్షిక ద్రవ్యోల్బణాన్ని 12 ఏండ్లకు జోడిస్తే సుమారు రూ.20.12 లక్షలు అవుతుంది. కాబట్టి ఈ మొత్తం కోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) కింద 12 ఏండ్లు ప్రతి నెలా పెట్టుబడిగా మీరు రూ.6,244 పెడితే సహజంగా అందే 12 శాతం ప్రతిఫలంతో ఆశించిన నగదును సమకూర్చుకోవచ్చు. మీరు పెట్టే పెట్టుబడి రూ.8,99,136. రాబడి రూ.11,13,006.58. మొత్తం రూ.20,12,142.58 పొందవచ్చు. ఈ రకమైన రాబడులను అందించే మ్యూచువల్ ఫండ్స్ స్కీములు మార్కెట్‌లో ప్రస్తుతం చాలానే ఉన్నాయి. అనేక బ్యాంకులు, ఇతరత్రా సంస్థలూ వాటిని అందిస్తున్నాయి. ఒక్కసారి పరిశీలించి, మీకు అనువైన నిర్ణయం తీసుకోవచ్చు. అయితే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్ ఒడిదుడుకులకు లోబడి ఉంటాయి. కాబట్టి మీ రిస్క్ ప్రొఫైల్‌నుబట్టి ఓ నిర్ణయం తీసుకోవడం ఉత్తమం. ఇందుకు మార్కెట్ ఎక్స్‌పర్ట్స్, మ్యూచువల్ ఫండ్ సలహాదారులను సంప్రదించడం చాలా మంచిది. తద్వారా మరింత మెరుగైన ఫలితాలను అందుకోవచ్చు. కాగా, కన్జర్వేటివ్ రిస్క్ ప్రొఫైలైతే లార్జ్ క్యాప్ ఫండ్స్‌ను, మాడరేట్ రిస్క్ ప్రొఫైలైతే మల్టీ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవడం మేలని మార్కెట్ పండితులు సూచిస్తున్నారు.



# పొదుపు ఖాతాపై నిఘా

### పరిమితికి మించి డిపాజిట్లతో చిక్కులు • ఐటీ రూల్ 114ఈ గురించి తెలుసా?


**మనలో** చాలామందికి ఒకటి లేదా అంతకన్నా ఎక్కువే సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్స్ ఉంటాయి. వీటిల్లో తరచూ నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్ కూడా ఉండనే ఉంటాయి. ఇంటి కంటే బ్యాంక్ పదిలమని కొందరు.. అవసరమున్నప్పుడు తీసుకోవచ్చు అప్పటిదాకా ఖాతాలో ఉండే నగదుకు వడ్డీ వస్తుందని ఇంకొందరు భావించి డిపాజిట్లు చేస్తూ ఉంటారు. అయితే ఈ పొదుపు ఖాతాల్లో లావాదేవీలకు ముఖ్యంగా డిపాజిట్లకూ ఓ పరిమితి ఉంటుందని మీకు తెలుసా? ఈ పరిమితి దాటితే మీరు ట్యాక్స్ పేయర్ పరిధిలోకి వస్తారని గమనించారా? అసలు ఆదాయ పన్ను (ఐటీ) నియమ, నిబంధనలు ఏం చెప్తున్నాయి.

**నిపుణుల మాట ఇదీ..**

నల్లధనాన్ని నిరోధించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టేట్‌మెంట్లను సబ్మిట్ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసిందని ట్యాక్స్ నిపుణులు చెప్తున్నారు. సేవింగ్స్ ఖాతాల్లో నిర్దేశిత మొత్తాన్ని మించి లావాదేవీలు జరిగినట్టైతే ఆ వివరాలను ఈ స్టేట్‌మెంట్లలో ఆయా సంస్థలు తెలియజేయాల్సి ఉంటుంది. పొదుపు ఖాతాల్లో నగదు వేసినా, తీసినా.. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు పెట్టినా.. క్రెడిట్ కార్డు ఖర్చులు, విదేశీ కరెన్సీల కొనుగోలు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఇలా ఏం జరిగినా ఐటీ శాఖకు తెలిసిపోతుంది.

**రూ.10 లక్షలు దాటితే..**

రోజులో లక్ష రూపాయలు, ఆర్థిక సంవత్సరంలో 10 లక్షల రూపాయలు ఎవరికైనా చెందిన ఒకటి లేదా అంతకుమించిన సేవింగ్స్ అకౌంట్స్‌ల్లో డిపాజిట్ లేదా విత్‌డ్రా అయితే ఐటీ శాఖకు బ్యాంకింగ్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆ వివరాలను తెలియపర్చాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చెప్తున్నది. అయితే కరెంట్ అకౌంట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయంలో ఇది వర్తించదు. కరెంట్ ఖాతాకు ఈ పరిమితి రూ.50 లక్షలు, ఆపైనే ఉన్నది. కాగా, ఈ లావాదేవీలకు కారణమైన నగదు ఎక్కడి నుంచి వచ్చిందనేది తెలుసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందనే ఆర్బీఐ ఈ పరిమితుల్ని తీసుకొచ్చింది.




**114ఈపై అవగాహన ఉండాలి**

ఐటీ సెక్షన్ 1962లోని 114ఈ నిబంధన కిందే సేవింగ్స్ ఖాతాల్లోని పరిమితికి మించిన లావాదేవీలను ఐటీ శాఖకు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు చెప్తున్నాయి. అందుకే 114ఈపై అవగాహన ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అకౌంట్స్ నుంచి జరిగే ఆదాయ, వ్యయాలకు సంబంధించినదే ఈ రూల్. బ్యాంక్ ఖాతా సేవల్ని అందించే ప్రతీ బ్యాంకింగ్ సంస్థ, సహకార బ్యాంకులకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం వర్తిస్తుంది. కాబట్టి నిబంధనలకు విరుద్ధంగా ఏ లావాదేవీని బ్యాంకర్లు, ఎన్‌బీఎఫ్‌సీలు దాచవు. సేవింగ్స్ ఖాతాల్లో మీరు వేసే, తీసే నయా పైసా లెక్కలోకి వస్తుంది. పరిమితి దాటితే పన్ను నోటీసులు ఖాయం. అధికారులకు సమాధానం చెప్పి, అవసరమైతే పన్నులు చెల్లించాల్సిందేనని మరువద్దు.

# బుల్‌ట్రెండ్‌లోనే మార్కెట్

**మార్కెట్ పల్స్**

**వడ్డీ రేట్ల** తగ్గింపు సంకేతాలతో యూఎస్ ఫెడ్ మరింత బలాన్ని ఇవ్వడంతో నెలరోజులుగా జరుగుతున్న మార్కెట్ ర్యాలీ మరింత స్పీడందుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ-50 ఇండెక్స్ గతవారంలో 488 పాయింట్లు పెరిగి ఆల్‌టైమ్ రికార్డు స్థాయి 21,457 పాయింట్ల వద్ద నిలిచి, వరుసగా ఏడో వారంలో సైతం లాభాలతో ముగిసింది. ఈ వారంలో కూడా బుల్‌ట్రెండ్ కొనసాగుతుందన్న అంచనాల్ని మెజారిటీ టెక్నికల్ అనలిస్టులు వెల్లడించారు. గ్యాప్ అప్ ఓపెనింగ్‌లతోపాటు ఇంట్రాడే ఒడిదుడుకులు తక్కువగా ఉండటం బుల్‌ట్రెండ్ పటిష్ఠతను సూచిస్తున్నదని సామ్కో వెంచర్స్ సీఈవో జిమిత్ మోదీ తెలిపారు. దాదాపు అన్ని రంగాల షేర్లూ ర్యాలీలో పాలుపంచుకోవడం, ముఖ్యంగా ఐటీ, కొన్ని బ్యాంకింగ్ దిగ్గజాలు వేగంగా పెరగడం మరింత అప్‌ట్రెండ్‌కు సంకేతమని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా చెప్పారు. ర్యాలీని మిస్ అయ్యామన్న ఇన్వెస్టర్ల భావన, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో మార్కెట్లో మూమెంటం కొనసాగుతుందని యాక్సిస్ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ రాజేశ్ పాల్వియా అంచనా వేశారు. మార్కెట్ తగ్గుదల కొనుగోళ్లకు అవకాశమని ట్రేడర్లు, ఇన్వెస్టర్లకు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్, డెరివేటివ్ అనలిస్ట్ కునాల్ షా సూచించారు.

**మద్దతు శ్రేణి 21250-21,300**

ఆప్షన్ రైటింగ్ యాక్టివిటీ ప్రకారం ఈ వారం నిఫ్టీకి 21250-21,300 శ్రేణి తక్షణ మద్దతు అందించవచ్చని, 21,500-21,600 పాయింట్ల శ్రేణి వరకూ పెరగవచ్చని రాజేశ్ పాల్వియా విశ్లేషించారు. ఈ శ్రేణిని దాటితే 21,800 వరకూ ర్యాలీ జరిగే ఛాన్స్ ఉంటుందన్నారు. పటిష్ఠమైన మూమెంటం నిఫ్టీని 21,700-22,000 పాయింట్ల స్థాయికి నడిపిస్తుందని కునాల్ షా అంచనా వేశారు. స్వల్పకాలిక కరెక్షన్లను క్వాలిటీ షేర్ల కొనుగోలుకు ఉపయోగించుకోవాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అనలిస్ట్ సుభాష్ గంగాధరన్ సూచిస్తూ సమీప భవిష్యత్‌లో మరింత పెరుగుదలను మార్కెట్ టెక్నికల్స్ వెల్లడిస్తున్నాయని వివరించారు.




## కొటక్ ఎఫ్‌డీలు ఆకర్షణీయం

**డిపాజిట్లను** ఆకట్టుకోవడానికి ఒక్కో బ్యాంక్ క్రమంగా వడ్డీరేట్లను పెంచుతున్నాయి. దీంట్లో భాగంగా కొటక్ మహీంద్రా బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం వరకు పెంచింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై సీనియర్లకు అదనంగా 85 బేసిస్ పాయింట్లు వడ్డీని పెంచింది. 23 నెలల నుంచి మూడేండ్ల లోపు డిపాజిట్లపై రెగ్యులర్ వడ్డీరేటును స్థిరంగా ఉంచిన బ్యాంక్.. సీనియర్ సిటిజన్లుకు మాత్రం ఐదు బేసిస్ పాయింట్లు సవరించింది. కానీ, మూడేండ్ల నుంచి నాలుగేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీని అర శాతం సవరించింది. దీంతో రెగ్యులర్ వడ్డీరేటు 6.50 శాతం నుంచి 7 శాతానికి చేరుకోగా, సీనియర్ సిటిజన్లకు 7 శాతం నుంచి 7.60 శాతానికి చేరుకున్నది. అలాగే నాలుగేండ్ల నుంచి ఐదేండ్ల లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై రేటును 6.25 శాతం నుంచి 7 శాతానికి, సీనియర్ సిటిజన్లకు 7.60 శాతానికి పెంచింది.